# లైంగిక వేధింపులు

## కౌమార యువతీ యువకులకు సూచనలు



# ముందుమాట

"లైంగిక వేధింపులు – కౌమార యువతీ యువకులకు సూచనలు" అన్న ఈ పుస్తకాన్ని మహిళా హక్కులపై పనిచేస్తున్న కొత్త ఢిల్లీకి చెందిన జాగోరి అన్న సంస్థ రూపొందించింది. దీన్ని గ్రామ్య మహిళా వనరుల కేంద్రం తెలుగులోకి అనువదించి ప్రచురించింది. ఇప్పుడు ఈ పుస్తకాన్ని చిన్న చిన్న మార్పులతో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ తిరిగి ప్రచురిస్తోంది.

భూమిక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మహిళలు, బాలల హక్కులపై పనిచేస్తోంది. తెలంగాణలో నారాయణపేట, కరీంనగర్, సిద్ధిపేట, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోను, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, రాజమండ్రిలలోను క్షేత్రస్థాయిలో పనిచేస్తోంది.

కౌమార దశలోని అమ్మాయిలు, అబ్బాయిలు పరస్పరం ఒకరిపట్ల ఒకరు సరైన దృక్పథం అలవర్చుకోవడం ఎంతో ముఖ్యం. పాఠశాలల్లో, కళాశాలల్లో, పని ప్రదేశాలలో స్త్రీ, పురుషులకు పరస్పర పరిచయాలు పెరుగుతున్నాయి. కానీ ఒకరిపట్ల ఒకరు ఎలా ప్రవర్తించాలో, ఒకరి నొకరు ఎలా గౌరవించుకోవాలో వారికి సరిగ్గా తెలియటం లేదు. ఈ పుస్తకంలోని అంశాలవారీ విషయాలు వాళ్ళ ఆలోచనల్లో స్పష్టతను చేకూర్చేందుకు, ఆత్మవిశ్వాసంతో కూడుకున్న ప్రవర్తనకూ, సరైన బాధ్యతాయుతమైన చర్యలకూ దోహదం చేస్తుందని మేము ఆశిస్తున్నాం.

*– భూమిక ఉమెన్స్ కలెక్టివ్*

# లైంగిక వేధింపులు అంటే...

- ఈల వేయటం.
- ఎదుటివారి శరీరంవైపు అదేపనిగా తేరిపార చూడటం.
- ఇష్టం లేకుండా ముద్దు పెట్టుకోవడం, కౌగిలించుకోవటం, తాకటం (ఎదుటివారి శరీరాన్ని రాసుకుంటూ పోవటం)
- ఇతరుల ఏకాంతంలోకి, వ్యక్తిగతంలోకి చొరబడటం, మహిళను అసౌకర్యంగా ఉండేలా చేయటం (ఆమెకు దగ్గరగా లేదా ఆమె మెడపై ఊపిరి తగిలేంత దగ్గరగా నిల్చోవడం).
- అసభ్యకరమైన వ్యాఖ్యానాలు చేయటం లేదా ఎదుటివారి రూపాన్ని గురించి లేదా లైంగికతను గురించి కామెంట్ చేయటం.
- ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడటం లేదా అసభ్యకరమైన సందేశాలు (ఇ-మెయిల్స్, ఉత్తరాలు, ఎస్ఎమ్ఎస్‌లు, ఎమ్ఎమ్ఎస్‌ల వంటివి) పంపించడం.
- అసందర్భంగా లైంగిక స్వభావం కలిగిన బహుమతు లనివ్వడం.
- ఒకరిని పదే పదే గమనించడం లేదా వెంబడించడం.
- ఇష్టానికి వ్యతిరేకంగా అశ్లీల సినిమాలను, చిత్రాలను, కవితలను, కథలను చూపించడం.
- మహిళను అవమానపరిచే విధంగా ఉండే గోడమీద రాతలు, జోక్‌లు, కార్టూన్‌లు వంటివి చూపించడం.
- లైంగిక సేవలను అభ్యర్థించడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం.

## లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం

- ఈ చట్టం 18 సం॥ల లోపు పిల్లలందరికీ వర్తిస్తుంది.
- బాలుడు/బాలిక శరీర భాగంలోకి ఏదైనా అవయవం లేదా వస్తువు ఏ మేరకు చొప్పించినా ఈ చట్ట ప్రకారం తీవ్ర శిక్ష విధించవచ్చు. ఈ పనిని పోలీసు, మిలిటరీ, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది జరిపితే శిక్ష తీవ్రత మరింత ఎక్కువ ఉంటుంది.
- బాలుడు/బాలిక శరీరాన్ని ఏ రకంగా అశ్లీల దృష్టితో తాకినా అది లైంగిక దాడి అవుతుంది. ఒకరికంటే ఎక్కువమంది ఏ రకమైన లైంగిక దాడి జరిపినా ఆ గుంపులోని ప్రతి ఒక్కరూ విడివిడిగా భావించి శిక్షించాల్సి వస్తుంది.
- బాలుడు/బాలిక చూసేలా సైగలు చేయడం, శబ్దాలు చేయడం, ఏదైనా వస్తువును లేదా శరీర అంగాన్ని లైంగిక ఉద్దేశ్యంతో ప్రదర్శించటం, సైగలు చేయటం, కామ ప్రేరితమైన వస్తువులు, బొమ్మలు, చిత్రాలు చూపినా, వెంటబడి తిరగడం ద్వారా లేదా ఫోన్, మెయిల్ వంటి

ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా వేధించినా లైంగిక నేరం క్రింద మూడేళ్ళ వరకూ జైలు శిక్ష పడుతుంది.

- ❖ బాలిడు/బాలికపై ఏ రకమైన లైంగిక నేరం జరిగేందుకైన ఏ విధంగా ప్రోత్సహించినా, నేరానికి ప్రయత్నించినా ఈ చట్టం ప్రకారం నేరం, ప్రోత్సహించడం ఏ రకంగా ఉన్నా శిక్షార్హమైన నేరమే.

నేరం జరిగినట్లు తెలిసినా, జరగవచ్చుననే భయం ఉన్నా, ప్రత్యేక బాలపోలీసు (జువెనైల్) విభాగానికి గానీ, స్థానిక పోలీసులకు కానీ తెలియచేయాలి. రిపోర్టు నమోదు చేసుకొని 24 గంటల లోపు ఈ విషయం ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీకి, పిల్లల న్యాయస్థానానికి, అది లేకుంటే సెషన్స్ కోర్టులో తెలియచేయాలి. ఆ బాలిక/బాలుడుకు రక్షణ అవసరమని భావించిన పక్షంలో తక్షణం అందుకు ఏర్పాట్లు చేయాలి.

ఇక టి.వి., పత్రికల వాళ్ళు బాధిత బాలిక/బాలుడు ముఖం చూపించడం చేయరాదు. బాధితుల పేరు, చదివే స్కూలు, ఇరుగు పొరుగు వంటి గుర్తింపును తెలియచేస్తే వారికి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష విధించవచ్చు.

# అమ్మాయిలకు ( ♀ ) సూచనలు

## వేధింపులకు గురయ్యే అవకాశాలను తగ్గించుకోవడం

### ఏం చెయ్యాలి?

♀ **వేధింపులను గుర్తించడాన్ని నేర్చుకోవాలి.** నిన్ను సిగ్గుపడేలా చేసేదీ, అవమాన పరిచేదీ, భయపెట్టే చర్య ఏదైనా వేధింపు కిందకే వస్తుంది. అవతలివారి ఉద్దేశ్యం ఏమిటనేది కాకుండా నువ్వేం అనుకుంటున్నావు అనేది ముఖ్యం. వేధింపునకు గురైనట్లుగా నువ్వు భావిస్తే, దానికి నిరసన తెలియచేయటం నీ హక్కు.

♀ **బిగ్గరగా, స్పష్టంగా నీ నిరాకరణను తెలియచెయ్యి.** ఎప్పటికీ పనికివచ్చే ఒక వాక్యాన్ని (ఇది చాలా బాధాకరంగా ఉంది – మూర్ఖంగా ఉండకు! ... వంటివి) తయారుచేసుకో. అది ప్రతిక్రియగా మారేంత వరకూ నీలో నువ్వే ఆ వాక్యాన్ని అనుకుంటూ ఉండు) ఇలాంటివి ఎదురైతే ఏం చెప్పాలో ఆలోచించి ముందుగానే సిద్ధపడు.

♀ **ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకో.** నిన్ను ఏ రకంగానైనా బెదిరిస్తున్న వారివైపు సూటిగా చూడు. స్పష్టంగా, ప్రశాం తంగా తిరుగు జవాబివ్వు. నువ్వెవరో, నువ్వెక్కడుండాలో నీకు తెలుసు అనే విషయం వారికి తెలిసేలా ఉండు.

♀ **స్నేహితుల్ని చేసుకో.** ఒంటరిగా ఉంటే వేధింపులకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. సహాయం కోసం అడిగినప్పుడు అనేకమంది ముందుకువచ్చే అవకాశాలే ఎక్కువ. అదేవిధంగా నీ సమక్షంలో

ఎవరైనా వేధింపులకు గురవుతుంటే ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉండు.

♀ **వేధింపులు ఇలాగే కొనసాగితే ఆ సంఘటన గురించి రిపోర్టు చేయాలి.** చర్య తీసుకోవాలని అభ్యర్థించాలి. లైంగిక వేధింపులు నేరం. దాన్ని చూసీచూడనట్టుగా వదిలెయ్య కూడదు. ఇది నియమాలను ఉల్లంఘించడంగా పరిగణించాలి. దీని గురించి తప్పనిసరిగా అధికారులకు ఫిర్యాదు చేయాలి.

♀ **నిన్ను గౌరవించే అబ్బాయిల్ని నువ్వు గౌరవించగలగాలి.** ప్రతి అబ్బాయీ వేధించేవాడు కాదు. అబ్బాయిల నేపథ్యం కారణంగానో, వాళ్ళు ధరించే దుస్తులు లేదా వారు మాట్లాడే భాషనుబట్టో వారిని తిరస్కారంగా చూడటం, వాళ్ళతో లెక్కలేకుండా ప్రవర్తించడమో చేయడం నీకున్న ప్రతికూల అభిప్రాయాలను గురించిన సందేశాన్నిస్తాయి. అటువంటి ప్రవర్తన నువ్వు ఇష్టపడని వారినుంచి ప్రతీకార చర్యల్ని ఆహ్వానిస్తుంది.

**ఏమి చెయ్యకూడదు?**

♀ **వేధింపులకు గురయ్యే అవకాశాలున్న స్థితిని ప్రదర్శించవద్దు.** బహిరంగ ప్రదేశాలలో ఉన్నప్పుడు అధైర్యంగా కనిపించవద్దు. తలవంచుకుని నడవడం, ఎవరైనా ఏదైనా అడిగినప్పుడు జవాబివ్వకుండా మౌనంగా ఉండటం చేయొద్దు.

♀ **సహాయం అడగడానికి భయపడవద్దు.** సహాయం కోసం అరచి కేకలు పెట్టడమే ఒక్కోసారి వేధింపులకు గురిచేసే వారిని బెదరగొడుతుంది. సహాయం కోసం అడగకపోతే, నీకు సహాయం అవసరమో కాదో ప్రజలకు అర్థం కాదు.

# అబ్బాయిలకు (♂) సూచనలు

## అర్థంలేని "పురుషాహంకారాన్ని" వదిలించుకోండి

**చేయవలసినవి:**

♂ **'అమ్మాయిలకు ఎలా కనిపిస్తున్నాను?" అనే విషయాన్ని తెలుసుకుని ఉండు.** ఎదుటి మనుషుల్ని గౌరవించి, వారినుంచి గౌరవాన్ని తిరిగి ఆశించే విధంగా నీ చూపు, మాట, ప్రవర్తన ఉండేలా తప్పని సరిగా చూసుకో. స్త్రీ వివక్షాపూరితమైన భాష, ఒట్లు పెట్టుకోవడం వంటివి లేకుండా మాట్లాడడం నేర్చుకోవాలి. అనవసరంగా కండబలాన్ని ప్రదర్శించ వద్దు. అలాగే మొరటుగా ఉండొద్దు.

♂ **మహిళలను మనుషులుగా, స్నేహితులుగా, సహోద్యోగులుగా (కొలీగ్స్) చూడడం నేర్చుకోవాలి.** అబ్బాయిలకు దూరంగా ఉండమని అమ్మాయిలకు బోధిస్తారు. అబ్బాయిల్లోని అతి స్నేహభావం బెదురు పుట్టించేదిగా, దాడిగా (అగ్రెసివ్) కనిపించవచ్చు. స్నేహపూర్వకంగా మాట్లాడే, ప్రవర్తించే విధానాన్ని అభ్యాసం చేయాలి. అతిగా ఉండవద్దు. మగవారి విలక్షణ ప్రవర్తనలో దేనిని ఆడవారు "అసహ్యించుకునేదిగా, ప్రమాదకారిగా భావిస్తారు" అనే విషయాన్ని ఎవరైనా స్నేహితురాల్ని అడిగి తెలుసుకోండి.

♂ **అమ్మాయిలను వేధింపుల నుంచి రక్షించడానికి, వారికి సహాయం చేయడానికి దూసుకెళ్ళేముందు వారు మిమ్మల్ని అర్థించేవరకూ ఎదురుచూడండి.** ఎందుకంటే, అమ్మాయి లంతా మీ రక్షణ అవసరమైనంత నిస్సహాయ పరిస్థితుల్లో ఉండి ఉండకపోవచ్చు. వాస్తవానికి అక్కర్లేని మీ 'సహాయాన్ని' వేధింపుగా కూడా కొందరు

అనుకోవచ్చు. మీ దరిదాపుల్లో వేధింపులకు అవకాశముందేమో జాగ్రత్తపడండి. మీ సహాయం అవసరమైనప్పుడు మాత్రమే సహాయం చేయడానికి సిద్ధపడండి. (చాలాసార్లు వేధించేవారిని నిరోధించడానికి, ఆమెకి మీరు సహాయం చేయడానికి ముందుకు రావడమే సరిపోతుంది)

**చేయకూడనివి:**

♂ **వేధింపుల్ని అమ్మాయిలు ఇష్టపడతారని అనుకోవద్దు.** వేధించేవారిని అమ్మాయిలు అసహ్యించుకుంటారు. తప్పుకుని తిరుగుతారు. అమ్మాయిలు 'కాదు' అంటే దాన్ని 'అవును'గా అర్థం చేసుకోవద్దు. అమ్మాయిలు అవునన్నారో కాదన్నారో మీకు స్పష్టంగా తెలియకపోతే అక్కడ్నుంచి తప్పుకోవడం క్షేమం.

♂ **విభిన్న దుస్తులు ధరించిన అమ్మాయిల్ని వేధించొచ్చు అని అంచనా వేయొద్దు.** అమ్మాయిలూ, అబ్బాయిలూ... ఇద్దరూ వారికిష్టమైన పద్ధతిలో దుస్తులు ధరించవచ్చు. అమ్మాయి ధరించిన దుస్తులు నీకు నచ్చకపోయినా కూడా అది నీ కోపాన్నీ, అనంగీకారాన్నీ వ్యక్తం చేసే హక్కును నీకివ్వదు. వేధింపులకు గురిచేయడమనేది ఒక నేరం. అది ఏ రకంగానూ సమర్థించరానిది.

♂ **వేధింపుల్ని తేలిగ్గా తీసుకోవద్దు.** దాన్ని 'ఈవ్ టీజింగ్' అనో, 'జోకింగ్' అనో అనవద్దు. లైంగిక వేధింపు ఒక తీవ్రమైన, అగౌరపరిచే చర్య, అది గాయం చేస్తుంది. మానసిక వేదననీ, నొప్పినీ కలుగచేస్తుంది. ఏ పేరుతో పిలిచినా దాన్ని అగౌరవ పరచడం అనే వాస్తవాన్ని మార్చలేదు.

♂ **మిగిలిన అబ్బాయిలు చేస్తున్నారు కదా అని నువ్వూ వేధించేవాడివిగా తయారుకావద్దు.** మందని అనుసరించడం గొర్రెలకీ, మేకలకీ సరిపోతుందేమో గాని, మందకి దూరంగా నిలవడం, నువ్వు ముఖ్యమని భావించడం నీ వారినుంచి నీకు గౌరవాన్ని తెచ్చి పెడుతుంది.

# ♀ అమ్మాయిలు ♂ అబ్బాయిలు

ఎవరైనా నన్ను వేధించినప్పుడు ముందుగా బెదిరిపోతాను. క్రమంగా అది చిరాకుగా మారుతుంది. చిరాకు కోపంగా మారుతుంది.

గోరంత దాన్ని కొండంత చేస్తున్నావు! టీజింగ్‌ని అమ్మాయిలు ఇష్టపడతారు.

దాన్ని పట్టించుకోకపోవడం ఉత్తమం. ఏదో ఒకరోజు వాళ్ళే ఆపేస్తారు.

నేను అమ్మాయిల్ని తాకను. ఊరికే కామెంట్స్ చేస్తాను. అలా చేయడం చాలా బావుంటుంది.

తమ శరీరాన్ని చూపించే విధంగా అమ్మాయిలు దుస్తులు ధరించినప్పుడు, కామెంట్లు ఎదుర్కోవడానికి కూడా వాళ్ళు సిద్ధపడాలి.

నేను నా స్నేహితురాళ్ళను గౌరవిస్తాను. కానీ వాళ్ళని టీజ్ చేస్తాం కూడా! అందులో హాని చేసేదేముంది?

నేను రోడ్డువెంట
నడుస్తూ వెళ్తున్నప్పుడు,
లిఫ్ట్ ఇస్తామంటూ
మగవాళ్ళు ఆఫర్ చేస్తే
నాకు తీవ్రమైన ఆగ్రహం
కలుగుతుంది.

అది నన్ను రోజంతా
వెంటాడుతోంది.
తీవ్రమైన కోపాన్ని నిశ్శబ్దంగా
దిగమింగుతాను. అంతకన్నా
ఏం చేయగలను?

అమ్మాయిల్ని
వేధించడాన్ని నేను
అస్వాదించలేనని నా
స్నేహితులతో చెప్పే ప్రయత్నం
చేశాను. కానీ వాళ్ళు నన్ను
ఏవేవో పేర్లు
పెట్టి పిలుస్తారు.

ఈవ్ టీజింగ్‌ని
లైంగిక వేధింపులంటూ
ఈ మహిళలు ఒకటే రాద్ధాంతం
చేస్తారు. వాళ్ళ అభిప్రాయాల్ని
వాళ్ళలోనే ఉంచుకోవడం
చాలా మంచిది.

నా ఇష్టానికి
వ్యతిరేకంగా నన్నెవరైనా
తాకితే... వాళ్ళు నాకు
తెలిసినవాళ్ళైనా, తెలియని
వాళ్ళైనా నాకు చాలా కోపం
వస్తుంది. అప్సెట్ అవుతాను.
లోలోపల చీదరగా
అనిపిస్తుంది.

## అమ్మాయిలకు చివరగా ఒక మాట

శరీరం మొత్తం కప్పుకుంటే వేధింపుల నుంచి రక్షణ ఉంటుందని నిన్ను నువ్వు మోసం చేసుకోకు. పాశ్చాత్య దుస్తుల కంటే భారతీయ దుస్తులు క్షేమకరం అని కూడా అనుకోవద్దు. ఏ దుస్తులు ధరించాలని నీకనిపిస్తే వాటిని ధరించే హక్కు నీకుంది. వేధింపు అనేది... నువ్వేం ధరించావనే దానితో పనిలేని... ఒక నేరం. అందరూ వేసుకుంటున్నారు కదా అని నీకు సౌకర్యంగా లేని బట్టల్ని ఎంపిక చేసుకోవద్దు. నీ వస్త్రధారణ గురించి ఇతరులు చెడ్డగా అనుకున్నప్పుడు ఏం చేస్తావో ఆలోచించాలి. నీకు నువ్వు హాని చేసుకోకుండా, అనాహ్లాదకరమైన పరిస్థితులను సంభాళించుకోగలనని నమ్మకం ఉన్నట్లయితే వాటినే ధరించు. అలా లేకపోతే, రిస్క్ తీసుకోవద్దు. మరేదైనా ధరించు.



# అబ్బాయిలకు చివరగా ఒక మాట

**‘వేధింపులను గుర్తించే సులభ సాధనం’**

ఏదైనా జోక్ పేల్చేముందు, కామెంట్ చేయబోయే ముందు, తమాషాగా ఏడిపించబోయే ముందు, అమ్మాయిలతో చొరవ తీసుకునే ముందు ఇలా ప్రశ్నించుకో...

“ఎవరైనా ఈ చర్యని చిత్రీకరించి రియాలిటీ టి.వి.లో చూపిస్తే నేనెలా ఫీలవుతాను?”

“ఈ చర్య పట్ల నా తల్లి, సోదరి, స్నేహితురాలి స్పందన ఎలా ఉంటుంది?”

“అటెన్షన్‌ని ఆమెపై బలవంతంగా రుద్దుతున్నానా?”

... వీటికి జవాబులు నీకు అసౌకర్యంగా అనిపిస్తే... ఆ పని చేయవద్దు.

ఆమె నుంచి ప్రతిస్పందన లేకుంటే... అది అక్కడితో ఆపేయడానికిదే తగిన సమయం!





## లైంగిక వేధింపులూ,
## స్త్రీ పురుషుల మధ్య సరసాలూ ఒక్కటి కావు

| **లైంగిక వేధింపు** | **స్త్రీ పురుషుల మధ్య సరసాలు** |
|---|---|
| కోరుకోనిది, ఇష్టం లేనిది | కోరుకునేది, ఇష్టపడేది |
| 'అసమాన' స్థితిలో ఉన్న వ్యక్తుల మధ్య జరిగేది | 'సమాన' స్థితిలో ఉన్న వ్యక్తుల మధ్య జరిగేది |
| నిన్ను బాధపెట్టేదిలా ఉంటుంది | నీకు సంతోషం కలిగిస్తుంది. |
| ఏకపక్షంగా ఉంటుంది. | ఇరువైపుల నుంచీ ఉంటుంది. |
| నువ్వు ప్రతిస్పందించలేవు. | అదేవిధంగా నువ్వు ప్రతిస్పందించగలవు. |
| అగౌరవపరచినట్లు, న్యూనపరచినట్లు అనిపిస్తుంది. | సంతోషాన్నిస్తుంది. |
| శక్తిహీనురాలిగా అనిపించేలా చేస్తుంది. | శక్తిని కలిగించినట్లుగా అవుతుంది. |
| సిగ్గునీ, ఆత్మన్యూనతా భావాన్ని కలిగిస్తుంది. | పాజిటివ్ ఆలోచనలనూ, ఆత్మవిశ్వాసాన్నీ ఇస్తుంది. |

## చట్టం ఏం చెబుతోందంటే...

చట్టం దృష్టిలో లైంగిక వేధింపు అనేది ఒక సామాజిక నేరమే కాక, శిక్షార్హమైన నేరం కూడా.

భారత శిక్షాస్మృతిలోని ఈ కింది సెక్షన్ల కింద ఈ వేధింపునకు గురిచేసేవారు శిక్షార్హులవుతారు:

- **సెక్షన్ 294:** అసభ్యకరమైన సంజ్ఞలు లేదా పాటలు పాడటం.
- **సెక్షన్ 354:** నేరపూరితంగా బలాన్ని ఉపయోగించి దౌర్జన్యంగా ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించడం.
- **సెక్షన్ 509:** అశ్లీలమైన మాటలు, సంజ్ఞల ద్వారా ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించడం.

# మనమేం చేయగలం?

## వేధింపులకు గురైనప్పుడు మనం:

- ♂ చుట్టుపక్కల ఉన్నవారి (వాళ్ళు స్నేహితులైనా, కొత్తవారైనా) సహాయాన్ని తీసుకోవాలి.
- ♂ ఈ వేధింపు ఏదైనా కాలేజీ లేదా విశ్వవిద్యాలయంలో జరిగితే కాలేజీలోని ఫిర్యాదుల కమిటీ లేదా అటువంటి వ్యవస్థ ఏదైనా ఉంటే దానికీ ఫిర్యాదు చేయాలి.
- ♂ బహిరంగ ప్రదేశంలో జరిగినట్లయితే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ♂ ఏదైనా మహిళా సంఘంలో ఫిర్యాదు నమోదు చేయాలి.

# పిల్లల కోసం అందుబాటులో ఉన్న సహాయ సంస్థలు

- ❖ ఛైల్డ్‌లైన్ – 1098
- ❖ గ్రామస్థాయి నుండి బాలల పరిరక్షణ కమిటీలు (VCPC)
- ❖ గ్రామస్థాయిలో అంగన్‌వాడి సెంటర్లు
- ❖ జిల్లాస్థాయిలో బాలల సంక్షేమ కమిటీలు (CWC), జిల్లా బాలల పరిరక్షణ విభాగం (DCPU)
- ❖ నేరారోపణ ఎదుర్కొంటున్న పిల్లల కోసం జిల్లా స్థాయిలో బాల న్యాయ మండలి (JJB)
- ❖ జిల్లాస్థాయిలో బాలల సంరక్షణ సంస్థలు (స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాలు)
- ❖ జిల్లాస్థాయిలో సఖి కేంద్రాలు, మహిళా హెల్ప్‌లైన్ – 181
- ❖ బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు :
  - – రాష్ట్రస్థాయి
  - – జాతీయస్థాయి
- ❖ రాష్ట్రమంతటా ప్రతి జిల్లాలోజాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రాజెక్టు పని చేస్తుంది.

# లైంగిక వేధింపులు

## కౌమార యువతీ యువకులకు సూచనలు

బొమ్మలు : బిందియా థాపర్

ప్రథమ  ముద్రణ :  2021

కాపీలకు : భూమిక ఉమెన్స్ కలెక్టివ్

ఫోన్ : 040 - 27660173

లేఅవుట్, కవర్ పేజీ డిజైన్ &

ముద్రణ : కళ్యాణి గ్రాఫిక్స్

చిక్కడపల్లి, హైదరాబాద్ - 20

మొబైల్ : 9493386871

భూమిక హెల్ప్‌లైన్ : 1800 425 2908

భూమిక ఉమెన్స్ కలెక్టివ్
హెచ్ఐజి-2, బ్లాక్-8, ఫ్లాట్-1
బాగ్‌లింగంపల్లి
హైదరాబాద్-500044

ఇ-మెయిల్: bhumikahyd@gmail.com
ఫోన్ : 040 - 27660173

భూమిక హెల్ప్‌లైన్ : 1800 425 2908